# మూసీ (నది) చప్పుళ్లు

తిరుమలశ్రీ

అయిదేళ్ల అనంతరం మళ్లీ ఊటీకి వచ్చాం నేను, మా ఆవిడాను. అప్పటికీ ఇప్పటికీ ఊరి స్వరూపంలో పెద్ద మార్పేమీ కన్పించలేదు. కాకుంటే హోటళ్ల సంఖ్య పెరిగింది. ఎప్పటిలాగే సుందర ప్రదేశాలతో, ఆహ్లాదకరమైన వాతావరణంతో అత్యంత రమణీయంగా వుంది. మూడు రోజులు అక్కడ గడపాలనుకున్నాం.

ఉదయమే నిద్రలేచి మార్నింగ్ వాక్‌కి బయలుదేరాం. శీతాకాలం ప్రవేశించింది. అయినా చలిని తట్టుకోవడం పెద్ద కష్టం కాలేదు. పరిసరాలన్నీ మంచు ముసుగు కప్పుకోవడంతో విజిబులిటీ తక్కువగా వుంది. పూలు, మొక్కలూ మంచు బిందువులతో తళతళలాడుతున్నాయి. పూల సౌరభాలు మదికి ఆవర్ణదం గొలుపుతూంటే యూకలిప్టస్ సువాసనలు శీతల పవనాలకు తోడై ఎంతో రిఫ్రెషింగ్‌గా అనిపించాయి. ఆ సుందర ప్రకృతిలో మమేకమై ఊటీ సుందరి ఉషోదయపు అందాలను ఆస్వాదిస్తూ చాలా దూరమే నడిచాము.

లేక్‌లో బోటింగూ, పోనీరైడూ, బొటానికల్ గార్డెన్స్‌లోని సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ, సుగంధాలను ఆఘ్రాణిస్తూ, నీలగిరులలోని రమణీయతను కెమేరాలో బంధిస్తూ రోజంతా చాలా ఆనందంగా గడిపివేసాము. సాయంత్రం హోటల్‌కి తిరిగి వచ్చేసరికి శారీరకంగా అలసిపోయినా, మానసికంగా ఎంతో ఫ్రెష్‌గా అనిపించింది. హాట్ వాటర్ షవర్ తీసుకునేసరికి బడలిక తీరిపోయింది.

డిన్నర్‌కి ఇంకా వ్యవధి వుంది. లాంజ్‌లో కొందరు గెస్ట్స్ టీవీ చూస్తున్నారు. మేమూ చూస్తూ కూర్చున్నాం ఏదో మ్యూజికల్ ప్రోగ్రాం వస్తూంటే...

అందులో పూర్తిగా లీనమైపోయిన మాకు హఠాత్తుగా ఏవో చప్పుళ్లు వినిపించడంతో వులిక్కిపడ్డాం. అవి టీవీలోంచి రావడంలేదని నిర్ధారణ కావడంతో చుట్టూ చూసాం.

ఆడియన్స్‌లో ఓ రెండు జంటలు తమ శరీరాలపైన తమంతట తామే అరచేతులతో బాదుకుంటున్నారు! రిథిమిక్‌గా – ఆగి ఆగి!!

ఆ దృశ్యం చూసిన మా ఆవిడ కన్నులలో భీతి ద్యోతకమయింది. పిచ్చివాళ్ల మధ్య వున్నట్టు. చల్లగా బయటకు జారుకున్నాం మేము. అనంతరం డిన్నర్ చేస్తూంటే – డైనింగ్‌హాల్లో మళ్లీ అవే శబ్దాలు!

వాళ్లే! అవే జంటలు! ఓ ప్రక్కన భోంచేస్తూనే మరో ప్రక్క వొళ్లంతా బాదుకుంటున్నారు, రెండో చేత్తో!!


ఆ దృశ్యం చూసిన మా ఆవిడ ఎంతగా హడలిపోయిందంటే మేము భోజనం మధ్యలోనే ఆపేసి హడావుడిగా బయటపడ్డాం. వాళ్లు తప్పకుండా పిచ్చివాళ్ల గుంపే అయివుంటుందన్న నిర్ధారణకు వచ్చింది మా ఆవిడ.

చాలాసేపు బయట లాన్‌లో గడిపి మా గదికి చేరుకున్నాం. గదితాళం తెరుస్తూంటే –

DGE

101






మళ్లీ వినిపించాయి ఆ చప్పుళ్లు. ఈసారి మా గదికి ఎదురుగా వున్న గదిలోంచి!

ఆ గదితలుపు ఓరగా తెరచివుండడం గమనించి, మెల్లగా వెళ్లి లోపలికి తొంగి చూసాను. వాళ్లలో ఒక జంట ఉంది లోపల. రెండవ జంట కనిపించలేదు. టీ.వీ. చూస్తూనే... ఎడతెరిపి లేకుండా తమ వొళ్లంతా చేతులతో బాదుకుంటున్నారు!

నా వెనుకే వచ్చి ఆ దృశ్యం చూసిన మా ఆవిడ ముఖం తెల్లగా పాలిపోయింది. తక్షణమే ఆ హోటల్‌గది ఖాళీ చేయాలని పట్టుపట్టింది. వెంటనే హోటల్ మేనేజర్ని పిలిపించాను. మాకు ఎదురైన వింత దృశ్యాన్ని, మా భయాలనూ వివరించి, "అలాంటి పిచ్చివాళ్లకు గదులు ఇచ్చారంటే, మీరు బిజినెస్ కోల్పోవడం ఖాయం" అంటూ హెచ్చరించాను.

ఫకాలున నవ్వాడతను. "వాళ్లు పిచ్చివాళ్లు కారు, సార్! క్వైట్ నార్మల్ పర్సన్స్. మన లాగే" అన్నాడు నవ్వాపి.

"మరి... వారి ప్రవర్తనకు... అర్థమేమిటి?" నిలదీసాను.

"వాళ్లు మా హైద్రాబాద్ కస్టమర్స్ సార్! రెగ్యులర్‌గా వస్తూంటారు..." "హైదరాబాద్ నగరం దోమలకు పెట్టింది పేరట. హుస్సేన్ సాగర్ లేక్, మూసీనదులే అందుకు దోహదకారులట. ఆ జంట నగరాలలో దోమలు ప్రజలపైన దాడిచేసి వొళ్లంతా కుట్టేస్తూ రక్తం పీల్చేస్తాయట. అందువల్ల అవి ఒంటిమీద వాలిన చోటల్లా కొట్టుకోవడం అలవాటైపోయి, దోమలు వాలినా, వాలకపోయినా..."

నిర్ఘాంతపోయాను నేను... అంతవరకూ హైదరాబాద్‌లో చరిత్ర ప్రఖ్యాతిగాంచిన గోల్కొండ ఫోర్ట్ గురించీ, ఫ్యామస్ టూంబ్స్ గురించే ఎరుగుదును నేను. ఇప్పుడు ఓ క్రొత్త విషయం తెలుసుకున్నాను.

నేను, మా ఆవిడ అప్పటికప్పుడే ఓ నిర్ణయానికి వచ్చాం. మా ప్రోగ్రాంలో తరువాతి మజిలీ అయిన హైద్రాబాద్‌ని స్కిప్ చేయాలని...!!